
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 । కనిష్ఠం : 22.0
ANDHRAJYOTHY
5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
ఆదివారం 3 నవంబరు 2024





కొల్లాపూర్ మార్కెట్ యార్డులో వర్షపునీటిలో తడిసిన మొక్కజొన్న

తప్పుల తడకగా పంటనష్టం జాబితా

- క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే వివరాలు నమోదు చేశారని ఆరోపణ
- అధికారులపై చర్యలు తీసుకోవాలి
- రైతు సంఘాల డిమాండ్

6



డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



6

మాట్లాడుతున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

మార్కెట్ యార్డులో తడిసిన మొక్కజొన్న

కొల్లాపూర్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న తడిసింది. కొల్లాపూర్ పట్టణంలో వర్షం లేకున్నా పట్టణ శివారులలో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షం కురిసింది. దీంతో వారం రోజుల నుంచి రైతులు ఆరబెట్టుకున్న మొక్కజొన్న వర్షం నీటిలో తడిసింది. వారం రోజులుగా మార్కెట్ యార్డులో పడిగాపులు కాస్తున్న ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు చేయకపోవడంతో రైతులు నష్టపోయారని, నష్టపోయిన రైతులకు మద్ధతు ధర చెల్లించి మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు డిమాండ్ చేశారు. అంతకుముందు తడిసిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు.

సర్వేకు సన్నద్ధం



గద్వాల జిల్లా కేంద్రంలో సన్నాహక సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

- 6 నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే
- గణన కోసం ముందుకొచ్చిన ఉపాధ్యాయులు.. సోమవారం శిక్షణ
- 50 రకాల ప్రశ్నలతో ఫార్మాట్ సిద్ధం చేసిన ప్రభుత్వం
- ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం కోసం కసరత్తు పూర్తి
- క్షేత్రస్థాయిలో పలుచోట్ల సన్నాహక సర్వే నిర్వహించిన అధికారులు

మహబూబ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు సంబంధించిన ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సర్వేను ఫ్లాగ్‌షిప్ కార్యక్రమంగా తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సర్వే కోసం గత నెల 10వ తేదీన జీవోఎంఎస్ నెంబర్ 18ని జారీ చేసింది. ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాలో సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న అధికారులు.. సోమవారంలోపు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ పూర్తి చేయనున్నారు. బుధవారం నుంచి ఈ సర్వే ప్రారంభించనున్నారు. ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటికీ వెళ్లి వివరాలు నమోదు చేయనున్నారు. నిర్దేశిత ఫార్మాట్‌ను ఇప్పటికే సిద్ధం చేశారు. మొత్తం 50 రకాల వివరాలను ఆ ఫార్మాట్‌లో పొందుపరుచనున్నారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్‌కేఎస్(సమగ్ర కుటుంబ సర్వే)ను చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు కూడా అదే స్థాయిలో వివరాలను సేకరించనుండగా.. ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా వినియోగించుకోనున్నారు. మొదట అంగన్‌వాడీలను ఎన్యుమరేటర్లుగా తీసుకోవాలని భావించారు. అయితే వివరాలు పకడ్బందీగా ఉండాలనే ఉద్దేశంతో టీచర్లకు బాధ్యతలు అప్పగించనున్నారు. అందుకోసం టీచర్లు తొలుత ససేమిరా అన్నప్పటికీ ప్రస్తుతం అందరూ ఒప్పుకున్నారు. దాదాపు 150 ఇళ్లను ఒక బ్లాక్ కింద ఏర్పాటు చేసి, ఒక ఎన్యుమరేటర్‌ను నియమించనున్నారు. వారిపైన సూపర్‌వైజర్లు, తర్వాత నోడల్ అధికారులను ఉంచుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఈ సర్వే ప్రతీ ఇంటికి వెళ్లి చేసేది

(మిగతా 6వ పేజీలో..)

క్రైం న్యూస్..

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

సోలార్ ప్లాంట్ వద్ద గ్రామస్థుల ఆందోళన

గద్వాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్ర మండల పరిధిలోని సోలార్ ప్లాంట్ సమీపంలో శనివారం విద్యుదాఘాతంలో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గుంటిపల్లి గ్రామానికి చెందిన గోవిందమ్మ, పెద్ద ఆంజనేయులు కుమారుడు రామాంజనేయులు (18) శనివారం మేకలకు మేత తీసుకురావడానికి సోలార్ ప్లాంట్ సమీపంలోకి వెళ్లాడు. అక్కడ ఓ చెట్టుపైకి ఎక్కి మేకలకు మేతను తీస్తుండగా చెట్ల కొమ్మల మధ్యలో సోలార్ విద్యుత్ సరఫరా అయ్యే వైర్లు ఉండటాన్ని గమనించకపోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆ వెంటనే చెట్టు నుంచి కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు సోలార్ పవర్ ప్రాజెక్టు వద్ద ఆందోళన చేశారు. అక్కడ అందుబాటులోలేని యాజమాన్యం రెండు రోజులలో వచ్చి మాట్లాడుతామని చెప్పడంతో శవాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పట్టణ ఎస్సై కల్యాణ్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురు సంతానంలో చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు అందరినీ కలిచివేశాయి.



రామాంజనేయులు (ఫైల్)

బోసిపోతున్న జీసీసీ కేంద్రాలు

- అందుబాటులో లేని నిత్యావసర సరకులు
- బియ్యం పంపిణీకే పరిమితమైన సంస్థ
- కొనలేక ఇబ్బంది పడుతున్న గిరిజనులు
- హాస్టళ్లకు పంపిణీపైనే అధికారుల దృష్టి



వటువర్లపల్లిలో మూతబడిన జీసీసీ కేంద్రం

నల్లమలలో గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) కేంద్రాలు బోసిపోతున్నాయి. అటవీ ప్రాంతంలోని గిరిజనులు అటవీ ఉత్పత్తులను సేకరించి, వారికి తక్కువ ధరకు నిత్యావసర సరకులు విక్రయించేందుకు 1971లో ప్రభుత్వం జీసీసీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు అటవీఉత్పత్తులు కొనుగోలు చేసినంత కాలం నల్లమల ప్రాంతంలోని పేదలకు జీవనోపాధి లభించింది. కొన్ని సంవత్సరాలు ఈ కేంద్రాలు సాఫీగానే సేవలందించాయి.. కానీ ఇటీవల అధికారుల నిర్లక్ష్యంతో మూతపడ్డాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జీసీసీ కేంద్రాల సేవలు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

\- దోమలపెంట, ఆంధ్రజ్యోతి



నల్లమల అటవీ ప్రాంతంలో సుగంధ పాల గడ్డలు ఆరపోస్తున్న గిరిజన మహిళ

6

లోపలి పేజీల్లో



అదుపులేని పేకాట

- స్థావరాలను ఏర్పాటు చేసి జూదం నిర్వహిస్తున్న కొందరు ప్రముఖులు
- ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు

7

బ్లాస్టింగ్‌లతో భయం భయం

- పొలాలకు వెళ్లాలంటే జంకుతున్న రైతులు
- ముచ్చెమటలు పట్టిస్తున్న క్వారీలోని పేలుళ్లు
- కార్మికుడు మృతి చెందిన నెలరోజులకే మరో ఘటన
- సల్కాపురం రైతులకు త్రుటిలో తప్పిన ప్రాణాపాయం
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా బ్లాస్టింగ్‌లు

6



సల్కాపురం ప్రభుత్వ గట్టు వద్ద కొనసాగుతున్న క్వారీ పనులు



కల్యాణం చేస్తున్న అర్చకులు

కల్యాణం కమనీయం

- ఘనంగా కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వివాహం

చిన్నచింతకుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌గనర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలో వెలిసిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం విశిష్ట పూజలు చేశారు. అనంతరం వివాహం జరిపించారు. ఈ వేడుకల్లో వివిధ మండలాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దాసంగాలు పెట్టి, మెక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు

\- తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ

గద్వాల న్యూటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు. శనివారం ఐడీవోసీ సమావేశ మందిరంలో కలెక్టర్ బీఎం సంతోష్ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఎంఈవో కేజీబీవీలు, డీఈవోలతో విద్యావ్యవస్థపై సూచనలు సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో మెరుగైన విద్యను అందించే దిశగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. అందుకు ప్రతీ ప్రభుత్వ పాఠశాల బలోపేతం చేసేందుకు సూచనలు ఇవ్వాలని కోరారు. పూర్వ ప్రాథమిక విద్య బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గద్వాలలో డైట్, డీఈడీ కళాశాల ఏర్పాటు చేయాలని తదితర సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత శాతం తక్కువగా ఉందని, జిల్లాకు ప్రత్యేకంగా విద్యాప్యాకేజీ ప్రకటించాలని అన్నారు. ఈ సందర్భంగా 109 సమస్యలు విన్నవించారని తెలిపారు.

అనంతరం సాయంత్రం ఐడీవో సీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ సంతోష్‌తో కలిసి ఎంఈవోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఇంగ్లిష్, తెలుగు మీడియం పాఠశాలలను నడపడానికి సలహాలు ఇవ్వాలని అధికారులను కోరారు. విద్యార్థుల కోసం తీసుకున్న ఈ విధానాలు, సలహాలను ప్రభుత్వానికి అందజేసి అమలు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ జ్యోష్ణ, శివారెడ్డి, రాచకొండ వెంకటేష్, విశ్వేశ్వరయ్య, అధికారులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

\- వీసీలో కలెక్టర్ ఆదర్శ్ సురభి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా అధికారులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం వరి కొనుగోలు అంశంపై రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ, సివిల్ సప్లయ్ డీఎస్ చౌహాన్ కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... జిల్లాలో వరి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. హార్వెస్టర్ ద్వారా కోతలు జరిగినప్పుడు 18 నుంచి 20 ఆర్‌పీఎం పెట్టుకొని పంట కోసే విధంగా హార్వెస్టర్‌కు సూచించాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, డీఎం ఇర్ఫాన్, మార్కెటింగ్ శాఖ అధికారి తదితరులు ఉన్నారు.

చోరీలకు పాల్పడిన నలుగురి అరెస్ట్

- రూ.9.35 లక్షల విలువగల నగదు, బంగారం, వెండి స్వాధీనం
- రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

వెల్దండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడిన నలుగురిని వెల్దండ సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ డోకూరి విష్ణువర్ధన్‌రెడ్డి వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శ్రీశైలం చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో టీఎస్ 07 కేఈ 9436 నెంబరు గల ఎర్టిగా కారులో ఉన్న వారిపై అనుమానం వచ్చి విచారించారు. ఈ విచారణలో ఆ నలుగురు చేసిన చోరీల గురించి వివరించారు. గతంలో వంగూరు మండలం రంగాపూర్‌లో వెండి నగలు, నగదు, కల్వకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగసానిపల్లిలో నగదు, వెండి, బంగారం, ఉప్పునుంతల మండలంలోని జప్తిసదగోడులో నగదు, వెండి వస్తువులను చోరీచేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి తొమ్మిది తులాల బంగారం ఆభరణాలు, కిలో 20 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.50వేల నగదు, రెండు సెల్‌ఫోన్‌లు, ఎర్టిగా కారును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. చోరీకి పాల్పడిన వారు వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తొరుమామిడి గ్రామానికి చెందిన గుడాల మాణిక్యం, నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం తుమ్మన్‌పేట గ్రామానికి చెందిన చింత బాల్‌రాజుతోపాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు తెలిపారు. మాణిక్యంపై గతంలో 15 కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కల్వకుర్తి కోర్టులో హాజరుపరి మైనర్లను జువైనల్ హోంకు తరలించనున్నట్లు తెలిపారు. తనిఖీలలో ఎస్‌ఐలు కురుమూర్తి, మాధవరెడ్డి, మహేందర్, కానిస్టేబుల్స్ అంజనేయులు, హరి, కిషోర్‌రెడ్డి, రాంబాబు, డ్రైవర్ శ్రీనివాస్‌రెడ్డిలు ఉన్నారు.

విద్యార్థులు విద్యలో రాణించాలి

\- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

వనపర్తిరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా ఫూలే రెసిడెన్షియల్ స్కూల్లో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉన్నారు. మీరు కూడా విద్యలో రాణించాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. శనివారం వనపర్తి మండలంలోని చిట్యాల మహాత్మ జ్యోతిబాఫూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిన్నారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1999 సంవత్సరంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సీసీ రోడ్లు, పాఠశాలలు, కమిటీ హాల్‌లు, శంకుస్థాపనలు చేశామని గుర్తు చేశారు. ఇదే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు జీవితంలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. పూర్వ విద్యార్థులు ఈ వేడుకలు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చిన్నారెడ్డిని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం స్కూల్‌కు సంబంధించిన కొత్త వెబ్‌సైట్‌ను చిన్నారెడ్డితో ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గురువయ్య, ఉపాధ్యాయ బృందం, స్కూల్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరంలో భక్తుల సందడి



ఆంజనేయస్వామికి నైవేద్యం తీసుకువెళ్తున్న ఆలయ కమిటీ చైర్మన్

అచ్చంపేట అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకొని శనివారం భక్తుల సందడి కనిపించింది. ఉమామహేశ్వరం కొండ దిగువన ఉన్న భోగమహేశ్వర ఆలయం వద్ద అంజనేయస్వామి మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి జయరాజ్ మాలధారణ చేయించారు. వివిధ ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

సదా మీ సేవలో..
అచిరకాలంలోనే ఆశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!
ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించండి

గద్వాల జిల్లా	:9985404383
మహబూబ్‌నగర్ జిల్లా:	8096677362
నాగర్‌కర్నూల్ జిల్లా	:8374394441
నారాయణపేట జిల్లా	:9985456557
వనపర్తి జిల్లా	:9010937550

పత్రిక పంపిణీలో ఏవైన అసౌకర్యాలు కలిగితే నిస్సంకోచంగా ఫోన్ చేసి తెలియజేయగలరు.
సర్క్యులేషన్ మేనేజర్ : 9985411170

పోలీసులు అందుబాటులో ఉండాలి

● జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు తీర్చాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ జిల్లా పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన ఎస్పీ, డీఎస్పీ కార్యాలయం సహా జిల్లాలోని కొత్తకోట, వనపర్తి సర్కిల్ కార్యాలయం, ఖిల్లాఘణపురం, అమరచింత, పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఫిర్యాదుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని తెలిపారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు పరచాలని సూచించారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తు ప్రజల మన్ననలు పొందాలన్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తూ.. దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని తెలిపారు. రౌడీ షీటర్స్, సస్పెక్ట్, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని బ్లూ కోల్ట్స్ సిబ్బందికి అధికారులకు సూచించారు. గంజాయి, గుట్కా గుడుంబా సరఫరాపై, గ్యాంబ్లింగ్‌పై నిఘా ఉంచాలని అన్నారు. అంతకు ముందు ఎస్పీ రావుల గిరిధర్ డీఐజీకి పూల మొక్క అందజేసి కార్యాలయంలోకి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎస్పీ రావుల గిరిధర్, సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర రావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం, సీఐలు, ఆయా మండలాల ఎస్ఐలు, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కావడంతో జిల్లాల్లోని ఇళ్ల సంఖ్యను అధికారులు సిద్ధం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 6.36 లక్షల జనాభా ఉండగా, 1.67 లక్షల ఇళ్లు ఉన్నాయి. మూడు మునిసిపాలిటీలు, 441 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సుమారుగా 1200 మంది ఎన్యుమరేటర్లు, 120 మంది సూపర్‌వైజర్లను నియమించనున్నారు.



వనపర్తి జిల్లా కేంద్రంలో సర్వేపై సలహాలు, సూచనలు సేకరించే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి(ఫైల్)

● జోగుళాంబ గద్వాల జిల్లాలో 7.49 లక్షల మంది జనాభా ఉండగా, 255 పంచాయతీలు, నాలుగు మునిసిపాలిటీలు, 331 ఆవాసాలు ఉన్నాయి. దాదాపు 1.32 లక్షల ఇళ్లు ఉన్నాయి. మొత్తం 1,296 మంది ఎన్యుమరేటర్లు, 130 మంది సూపర్‌వైజర్లను నియమిస్తున్నారు. ఒక్కో బృందానికి 10 మంది ఎన్యుమరేటర్లు, ఒక సూపర్ వైజర్లు ఉంటారు. టీచర్లు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లను సర్వేలో వినియోగించుకోనున్నారు.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో 1,721 ఆవాసాలు ఉండగా.. 8.60 లక్షల మంది జనాభా ఉన్నారు. ఒక్కో గ్రామానికి రెండు బృందాలు ఏర్పాటు చేయనుండగా, ఒక్కో బృందంలో ముగ్గురు సిబ్బందిని నియమించే అవకాశం ఉంది.


● నారాయణపేట జిల్లాలో 5.66 లక్షల జనాభా ఉండగా, 280 పంచాయతీలు, మూడు మునిసిపాలిటీలు ఉన్నాయి. దాదాపు 1.10 లక్షల ఇళ్లు ఉన్నాయి. ఒక్కో పంచాయతీకి రెండు నుంచి మూడు బృందాలను జనాభా ఆధారంగా నియమించనున్నారు.

● వనపర్తి జిల్లాలో 255 పంచాయతీలు, ఐదు మునిసిపాలిటీలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 5.77 లక్షల జనాభా ఉంది. 1.23 లక్షల ఇళ్లు ఉన్నాయని అంచనా ఉండగా.. ఒక్కో గ్రామానికి జనాభాను బట్టి మూడు నుంచి నాలుగు బృందాలను ఏర్పాటు చేయనున్నారు.

సర్వేలోనే సర్వం..

ఒక కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలు సర్వేలో ఉండే విధంగా ఫార్మాట్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. జిల్లాకు, మండలానికి కోడ్ ఉండగా, గ్రామం/ఆవాసం, వార్డు, ఇంటి నెంబర్, వివరాలు ఉంటాయి. అలాగే కుటుంబానికి ఒక సంఖ్య ఉంటుంది. మొదట కుటుంబ యజమాని, సభ్యుల పేర్లు, కుటుంబ సభ్యులకు యజమానితో సంబంధం, స్త్రీ/పురుషుడు, మతం, సామాజిక వర్గం(ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ), కులం, కులం ఇతర పేర్లు, వయసు ఉంటాయి. తర్వాత మొబైల్ నెంబర్, వైవాహిక స్థితి, వివాహ సమయం నాటికి వయసు, పాఠశాల రకం, విద్యార్హతల వివరాలు, అత్యున్నత విద్యార్హత ఒక ఫార్మాట్‌లో నమోదు చేస్తారు. అలాగే ఉపాధికి సంబంధించి ప్రస్తుతం చేస్తున్న పని, ఉద్యోగం చేస్తే ఆ వివరాలు, వ్యాపారం చేస్తే వార్షిక టర్నోవర్, కార్మికులు అయితే ఏ రంగం, కులవృత్తి ఏంటి? కుల వృత్తి వల్ల ఏదైనా వ్యాధి కలిగితే ఆ వివరాలు, వార్షిక ఆదాయం, బ్యాంకు ఖాతా ఉందా? అనే ప్రశ్నలు ఉంటాయి. తర్వాత భూమి వివరాలు ఉంటాయి. భూమి ఉందా? ధరణి పాస్‌పుస్తకం ఉంటే నెంబర్, అందులో పట్టా ఎంత? అసైన్డ్ ఎంత; అటవీహక్కు భూమి ఉంటే ఎంతుంది? తరి, మెట్ట, పడావు రకాలు, నీటి పారుదల వసతి, కౌలు చేస్తే ఆ విస్తీర్ణం, రిజర్వేషన్‌కు సంబంధించి దాని ద్వారా పొందిన విద్య, ఉద్యోగ ప్రయోజనాలు, ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన పథకాల పేర్లు ఏవైనా మూడు, కుల ధ్రువీకరణ పత్రం ఉందా? లేదా? అనే వివరాలు పొందుపరుస్తారు. రాజకీయానికి సంబంధించి ప్రజాప్రతినిధి లేదా ఆఫీస్ బేరర్‌గా పని చేశారా? లేదా? నామినేటెడ్, కార్పొరేషన్, సహకార సంఘం, ప్రభుత్వేతర సంస్థల్లో సభ్యులుగా ఉన్నారా?.. ఉంటే ఎన్ని సంవత్సరాలు, మీ కుటుంబం నుంచి ఎవరైనా వలస వెళ్లారా? ఏ దేశం, ఏ రాష్ట్రం, వలస వెళ్లడానికి గల కారణాలను నమోదు చేయాలి. ఐదేళ్లలో ఏమైనా రుణాలు తీసుకున్నారా?.. తీసుకుంటే ఏ అవసరం కోసం తీసుకున్నారు?, ఎక్కడి నుంచి రుణం తీసుకున్నారు? ఏదైనా వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో పాల్గొంటే ఆ వివరాలు, కుటుంబానికి ఉన్న పశుసంపద, స్థిరాస్తి, చరాస్తి వివరాలు, నివాస గృహం రకం, ప్రాంత స్వభావం, గదుల సంఖ్య, యాజమాన్య స్థితి, ఇంటి గోడను దేనితో కట్టారు? ఇంటి పై కప్పు దేనితో కట్టారు అనే వివరాలను నమోదు చేయాలి. ఇతర కులాల వారితో వివాహం, ఎలాంటి బెదిరింపులు లేకుండా వారి దేవుళ్ల ఆలయాలకు వెళ్లగలుగుతున్నారా? వసతులు పొందుతున్నారా? ఇతర కులాల వేడుకలకు ఆహ్వానాలు ఉంటున్నాయా? అనే వివరాలను సర్వేలో భాగంగా సేకరిస్తారు. తర్వాత ఇంటి యజమాని, ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్ వాటిపై సంతకాలు చేయాల్సి ఉంటుంది.

బ్లాస్టింగ్‌లతో భయం.. భయం





జోగన్‌గుట్టలో నెర్రెలిచ్చిన ఇల్లు, బ్లాస్టింగ్ రాయి తగిలి గాయపడి చికిత్స పొందుతున్న రైతు నవీన్

గట్టు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : క్వారీలలో బ్లాస్టింగ్‌లతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కార్యాలయాలకు కూత వేటు దూరంలో ఉన్న సల్కాపురం గుట్టలో యథేచ్ఛగా బ్లాస్టింగ్‌లు జరుపుతున్నారు. ఈ బ్లాస్టింగ్‌ల చప్పుళ్లకు రైతులు, గ్రామస్థులు భయం భయంగా బతుకుతున్నారు. బ్లాస్టింగ్ జరుగుతున్న గుట్ట చుట్టూ వందల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా గుట్టలో బ్లాస్టింగ్‌లు జరుపుతుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పొలాలకు వెళ్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తతంగంపై రైతులు, గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. క్వారీ నుంచి పక్కనే ఏర్పాటు చేసిన క్రషర్ ద్వారా 10 ఎంఎం కంకరతో పాటు 20 ఎంఎం, కంకర, డస్ట్ అంతా కలిపి రోజుకు 500 టన్నుల పైగా తరలిపోతున్నది. నిత్యం వందలాది టిప్పర్లు గ్రామాల వైపు తిరుగుతుండటంతో వచ్చే దుమ్ముతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రోడ్లు కూడా ధ్వంసమైపోతున్నాయని వాపోతున్నారు.

ప్రమాదం జరిగి నెల గడవకుండానే..

సల్కాపురం గుట్టలో వరుస సంఘటనలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అనుమతులు లేని బ్లాస్టింగ్‌ల వల్ల ఇదే క్వారీలో అగస్టు 25న జరిపిన బ్లాస్టింగ్‌లో క్వారీలో పని చేసే ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ విజయ్‌కుమార్‌సింగ్ గొండు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎక్స్‌కవేటర్ నుజ్జునుజ్జైంది. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన జరిగిన అనంతరం పేలుళ్లు నిలుపుదల చేశారు. కొద్ది రోజుల తర్వాత అధికారులను మచ్చిక చేసుకుని మళ్లీ బ్లాస్టింగ్‌లు జరపడం ప్రారంభించారు. ఈసారి పొలాల్లో ఉన్న రైతులకు రాళ్లు తగిలాయి. పొలంలో పత్తి తీస్తుండగా పది కేజీల బరువుగల రాయి తగలడంతో నవీన్ అనే రైతుతో పాటు పద్మ గాయపడ్డారు. వెంటనే వారిని గద్వాల ఆసుపత్రికి తరలించారు. నవీన్‌కు రాయి కడుపులోకి వెళ్లడంతో సర్జరీ చేశారు. ప్రస్తుతం ఆయన ఇంట్లోనే ఉంటూ వైద్యసేవలు పొందుతున్నాడు. బ్లాస్టింగ్ జరిగినప్పుడల్లా ఏదో ఒక సంఘటన చోటు చేసుకుంటున్నదని, కొన్ని మాత్రమే బయటకు వస్తుండగా కొన్ని లోలోపలనే మూసిపెడుతున్నారని రైతులు వాపోతున్నారు. బ్లాస్టింగ్‌ల బారినుంచి రక్షించాలని ఇక్కడి గ్రా మాల ప్రజలు, రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

ఇంటి గోడలు నెర్రెలు బారుతున్నాయి..

సల్కాపురం గుట్ట దగ్గర సర్వే నంబరు 199 ప్రభుత్వ భూమిలో క్వారీని అక్రమంగా ఏర్పాటు చేశారు. బ్లాస్టింగ్ చేయాలంటే మైనింగ్‌శాఖ, పోలీసులు అనుమతితో పాటు స్థానిక ప్రజల ఇళ్లు తదిర వాటిని పరిశీలించి బ్లాస్టింగ్‌లకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం ఎలాంటి అనుమతులు లేకుండా కంప్రెషర్‌లతో బ్లాస్టింగ్ చేస్తున్నారు. పేలుడు దాటికి ఇళ్లు కంపిచడంతో పాటు నెర్రెలు బారుతున్నాయని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కాలుష్యం శాంపిల్స్ సేకరణ

బాలానగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని పెద్దయపల్లి గ్రామ సమీపంలో గల హరి ఓం ఐరన్ పరిశ్రమ నుంచి వెదజల్లుతున్న కాలుష్యం వల్ల తమ పంట పొలాలు నాశనం అవుతున్నాయని రైతు రాజుందర్‌రెడ్డి, ఇతర రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు స్పందించారు. శనివారం సంబంధిత రైతు పొలంలో పరిశ్రమ నుంచి వెదజల్లుతున్న కాలుష్యాన్ని పరిశీలించినట్లు తెలిపారు. అలాగే ల్యాబ్‌లో టెస్టింగ్ కోసం శాంపిల్స్‌ను సేకరించినట్లు వెల్లడించారు. కాగా, ఐరన్ పరిశ్రమ గత కొన్నేళ్లుగా వెదజల్లుతున్న కాలుష్యం వల్ల అనేక రకాలుగా భూసారం తగ్గిపోవడమే కాకుండా పంటలు నష్టపోతున్నాయని రైతులు అధికారులతో పేర్కొన్నారు. పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు.



హరి ఓం ఐరన్ పరిశ్రమను పరిశీలిస్తున్న అధికారులు

చేనేత పథకాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ అదనపు సంచాలకులు వెంకటేశం

నారాయణపేట టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో శనివారం చేనేత పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ అదనపు సంచాలకులు వెంకటేశం హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక చేనేత కార్మికుల స్థితిగతులపై చర్చించారు. సంఘాలు తీసుకున్న రుణాలు మాఫీ చేస్తే సంఘాలు బలోపేతం అవుతున్నాయా, లేదా అనే చర్చ జరిగింది. కార్యక్రమంలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ అధికారులు పద్మ, బాబు, గోవిందయ్య, రతన్‌కుమార్, హిమజకుమార్, చారి పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

● మానవపాడు మండల కేంద్రంలో ఘటన

మానవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలోని న్యూ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న రాజు గుడిసే శనివారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. సాయంత్రం గుడిసే నుంచి పొగలు రావడంతో కాలనీవాసులు గ్రహించి గుడిసెను తెరిచి చూశారు. మంటలు వస్తుండటంతో యువకులు నీళ్లు చల్లి అదుపులోకి తీసుకొచ్చారు. కాగా అప్పటికే గుడిసెలో ఉన్న నిత్యావసర సరకులు, బట్టలు, బియ్యం, టీవీ, ఫ్రిజ్, ట్రంకు పెట్టెలు కాలిపోగా, దాదాపుగా రూ.లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించింది.

బోసిపోతున్న జీసీసీ కేంద్రాలు

దోమలపెంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) కేంద్రాలను ప్రభుత్వం 1971 సంవత్సరంలో ఏర్పాటు చేసింది. ఐదు దశాబ్దాల కుపైగా గిరిజనులకు సేవలందించిన ఈ కేంద్రాలు నేడు బోసిపోతున్నాయి. నల్లమల లోతట్టు ప్రాంతంలో నివసిస్తున్నవారు అటవీ ఉత్పత్తులను సేకరించి, వాటిని జీసీసీ కేంద్రాలలో విక్రయించేవారు. విక్రయిస్తే వచ్చిన ఆదాయంతో తిరిగి అదే కేంద్రాలలో నిత్యావసర సరకులు కొనుగోలు చేసేవారు. ఈ కేంద్రాలు వటువర్లపల్లి, సార్లపల్లి, దోమలపెంట, మన్ననూర్ వంకేశ్వరం, చెన్నంపల్లి, మద్దిమడుగు, అప్పాపూర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో అటవీ ఉత్పత్తులైన కుంకుడుకాయలు, కర్కకాయలు, జీడిగింజలు, విప్పపరక, సుగంధపాలగడ్డలు, చిల్లగింజలు, విషముష్ఠి గింజలు, తేనే, మైనం, నరమామిడి చెక్క, చీపురుకట్టలు మొదలగు వాటిని కొనుగోలు చేసేవారు. దీంతో నల్లమల ప్రాంతంలో ఉన్న పేదలకు జీవనోపాధి లభించేది. జీసీసీ కేంద్రాలలో నిత్యావసర సరకు, వంట పాత్రలు, దుస్తులు, దుప్పట్లు విక్రయించి గిరిజనులకు సేవలందించేవారు. కానీ 15 సంవత్సరాలుగా జీసీసీ ద్వారా హాస్టళ్లకు వంట సరకుల సరఫరా చేయడం, అధికారులు సూపర్ మార్కెట్లపై దృష్టి సారించి జీసీసీ కేంద్రాలను నిర్వీర్యం చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. సరకులు అందించే వ్యాపారులు అధికారులకు అధికంగా మామూళ్లు ముట్టజెపుతున్నందనే ఈ కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న జీసీసీ కేంద్రాలలో ప్రతీ నెల పౌరసరఫరాల సంస్థద్వారా వచ్చే బియ్యం, కిరోసిన్ పంపిణీ చేస్తున్నారు. గ్రామంలో ఉన్న దుకాణాలలో సరకులు కొనేందుకు అధికంగా డబ్బులు ఖర్చు అవుతున్నాయనీ, అధికారులు స్పందించి జీసీసీ కేంద్రాలలో పూర్వం మాదిరిగా అన్నిరకాల వంట సరకులు విక్రయించే విధంగా చర్యతీసుకోవాలని వివిధ చెంచుపెంటలు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నల్లమలలో సుగంధపాల గడ్డలు తవ్వుతున్న గిరిజనులు

నిధులు, సిబ్బంది కొరత ఉంది

నల్లమలో అటవీ ప్రాంతంలో చాలా వరకు అటవీ ఉత్పత్తులు తగ్గాయి. జీసీసీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు నిధులు, సిబ్బంది కొరత ఉన్నది. ప్రస్తుతం ఉన్నవారికే బియ్యం పంపిణీ చేసేందుకు ఒక్కొక్కరికి మూడేసి డిపోలను అప్పగించాం. అటవీ ఉత్పత్తులు వస్తే కొనుగోలు చేస్తాం.

- సంతోష్, జీసీసీ మేనేజర్ మన్ననూర్

అన్ని రకాల సరకులు విక్రయించాలి



నల్లమల ప్రాంతంలో ఉన్న అన్ని జీసీసీ కేంద్రాలను పున్నరుద్ధరించాలి. గిరిజనులకు అన్ని రకాల ఆహార పదార్థాలు, వంట సరకులు తక్కువ ధరలకు విక్రయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మల్లికార్జున్, తెలంగాణ చెంచు వేదిక అధ్యక్షుడు

కమీషన్ రాదని పట్టించుకోవడం లేదు



అటవీ ప్రాంతంలో గిరిజనులు సేకరించిన వస్తువులు జీసీసీ కేంద్రాల్లో కొనుగోలు చేయాలి, నిత్యావసర సరకులు కూడా అందుబాటులో ఉంచాలి. కానీ వంట సరకులు అమ్మితే అధికారులకు కమీషన్ రావడం లేదని కేంద్రాలను నిర్లక్ష్యం చేస్తున్నారు.. ఉన్నతాధికారులు స్పందించి ఈ కేంద్రాలకు పూర్వ వైభవం తీసుకురావాలి.

- రాములు, జిల్లా చెంచు యువజన సంఘం అధ్యక్షుడు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కొనుగోలు కేంద్రం వద్ద ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ కొనుగోలు కేంద్రాలను పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. కల్వకుర్తి మండల పరిధిలోని తుర్కలపల్లి గేటు సమీపంలో పత్తి మిల్లులో శనివారం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మధ్య దళారులను పత్తి రైతులు ఆశ్రయించకుండా నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్‌బృంగి ఆనంద్‌కుమార్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పెద్దపల్లి విద్యార్థిని

తెలకపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండల పరిధిలోని పెద్దపల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విజయలక్ష్మీ ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ జిల్లా కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విజయలక్ష్మీ ఎంపికవగా పాఠశాల జీహెచ్ఎంసీ ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

తప్పుల తడకగా పంటనష్టం జాబితా

- క్షేత్రస్థాయిలో పర్యటించకుండానే వివరాలు నమోదు చేశారని ఆరోపణలు
- అధికారులపై చర్యలు తీసుకోవాలి
- రైతు సంఘాల డిమాండ్

పదర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పదర మండలంలో రైతులు ప్రతీ సంవత్సరం పత్తి పంట, మిరప, కంది, జొన్న పంటలు వేస్తుంటారు. ఈ సంవత్సరం కూడా 11,978 ఎకరాలలో పత్తి, 856 ఎకరాలలో మిరప, 235 ఎకరాలలో కంది పంట వేశారు. అందులో ప్రస్తుతం 2,120 ఎకరాలలో పత్తి, 40 ఎకరాలలో మిరప, 125 ఎకరాలలో కంది నష్టపోయినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆది నుంచి పంట పండే వరకు అన్ని విధాల సమయానికి తగ్గట్టుగా కురిసిన వర్షం నేడు చేతికొచ్చే సమయంలో భారీవర్షాలకు పత్తి నల్లబడిపోయింది. అదేవిధంగా మిరప పంటలో రకరకాల తెగుళ్లు వస్తున్నాయి. ఎడతెరప లేకుండా వరుసగా కురిసే వర్షాలకు అనేక రకాలుగా పంటనష్టం జరిగింది. అధిక వర్షాలకు ఇలా జరుగుతున్నా పంటనష్టాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు రికార్డు చేసి పై స్థాయి అధికారులకు నివేదికలు పంపించాల్సి ఉంటుంది.

పదర మండల కేంద్రంతో పాటు మరో రెండు క్లస్టర్లున్నాయి. మండలంలో 10గ్రామాల్లో చాలా మంది రైతులు మాకు పంట నష్టం రాలేదనే ఆరోపిస్తున్నారు. ఇంకొంత మంది రైతులు అసలు క్షేత్ర స్థాయిలో తిరగకుండానే వ్యవసాయ అధికారులు వారికి తెలిసిన రైతుల పేర్లు నమోదు చేశారని మండిపడుతున్నారు. సమాచారం లేకుండా వివరాలు ఎలా నమోదు చేస్తారని, కనీసం మీడియా ద్వారైనా సమాచారం ఇవ్వాలని వాపోతున్నారు. మరికొంత మంది నిరక్షరాస్య రైతులు పంట నష్టం జాబితా నమోదు చేసుకునే అధికారులు గ్రామంలో కనీసం డప్పు చాటిస్తేనైనా మాకు తెలుస్తుందని అంటున్నారు. తప్పుడు సమాచారంతో నివేదికిచ్చిన అధికారుల్ని గుర్తించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పంటనష్ట పరిహారం చెల్లించాలి

ఐదెకరాల్లో పత్తి నాటిన. ఈ ఏడు పంట బాగా పండింది కానీ, పత్తితీసే సమయంలో కురిసిన వర్షానికి వర్షపు నీరు పొలంలోనే నిలిచిపోవడంతో పం టంతా నాశన మైంది. ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి. లేకపోతే మాలాం టోళ్లం చాలా ఇబ్బంది పడతం.

- ఆవుల వెంకటయ్య, రైతు, చిట్లంకుంట

అధికారులపై చర్యలు తీసుకోవాలి



పంటనష్టం జరిగిన రైతులందరికీ న్యాయం జరగాలి. లేదంటే కలెక్టరేట్ ముందు ధర్నాకు దిగుతాం. వ్యవసాయాధికారులు కనీసం ఫీల్డ్ విజిట్ చేయరు. గ్రామంలో ఎవరికీ సమాచారమివ్వరు. ఏఓ అందుబాటులో ఉండరు. బాధిత రైతులు కంటతడి పెట్టుకుంటున్నారు. ఇలాంటి అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

- రాసనూరి అంజనేయులు, రైతు సంఘం అధ్యక్షుడు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తిమ్మాజిపేట విద్యార్థిని

తిమ్మాజిపేట, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు తిమ్మాజిపేటలోని జడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లీష్ మీడియం పదవ తరగతి చదివే కే.శిరీష అనే విద్యార్థిని ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం శనివారం తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కే.శిరీష అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ శెట్టి, ఉపాధ్యాయులు సామ్సన్, వెంకటేశ్వర్లు, అనీత, అమర్, సోనార్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, గీతాంజలి, కిరణ్‌కుమార్, అరుణ, అశోక్ తదితరులు విద్యార్థినిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి
- కష్టపడిన వారికి పదవులు ఇంటికి వస్తాయి
- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- విజయ డెయిరీ చైర్మన్‌గా నర్సయ్య ప్రమాణం

అచ్చంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు, ప్రజలు విజయ డెయిరీ కేంద్రం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ ప్రమాణస్వీకారోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో పాటు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ డెయిరీ కేంద్రం చైర్మన్‌గా దొడ్ల నర్సయ్యతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం వారిని పూలమాలలతో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన చైర్మన్ పాడి రైతులతో కలిసి విజయ డెయిరీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం రైతుల కోసం, రైతు సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. రుణమాఫీ కాని రైతులకు కొన్ని చిన్న చిన్న తప్పులు ఉంటే త్వరలో సరిదిద్దుకుంటే రుణమాఫీ అవుతుందన్నారు. రైతులకు రుణమాఫీతో పాటు ఈ ఖరీఫ్‌లో సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తుండడంతో రైతులకు అదనంగా ఎకరాకు రూ.10వేల ఆదాయం వస్తుందన్నారు. కార్యకర్తలు కష్టపడితే పదవులు తమ ఇంటికే వస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మీ ఓట్లు వేసి గెలిపిస్తే నేను ఎమ్మెల్యేను అయ్యానని, ఆ గుర్తింపు నాకు మీద్వారా వచ్చిందని, ఇప్పుడు వచ్చేవి మీ ఎన్నికలు సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు అన్ని ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపించుకునే బాధ్యత నాదన్నారు. అందరం కష్టపడి పనిచేసి నియోజకవర్గంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించి ముఖ్యమంత్రి ద్వారా అధిక నిధులు తెచ్చుకొని అభివృద్ధి చేసుకుందామన్నారు. పాడి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివా సులు, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



విజయ డెయిరీ కేంద్రం చైర్మన్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

కల్వకుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం గుండూరు జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న అక్షిత రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైంది. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో నిర్వహించిన అండర్-14 విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థినిని ఉపాధ్యాయులు సత్కరించారు.



విద్యార్థిని సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

క్రైం కార్నర్

బస్సు ఎక్కుతుండగా

కిందపడి వ్యక్తి మృతి

- మృతదేహంతో కుటుంబ సభ్యుల రాస్తారోకో



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

వనపర్తి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి మండల పరిధిలోని రాజపేట గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రాజపేటకు చెందిన ఎల్లన్న పని నిమిత్తం కొత్తకోటకు వెళ్లి తిరిగి ఆర్టీసీ బస్సులో వస్తున్నాడు. రాజపేట బస్టాప్ దగ్గర బస్సు దిగుతుండగా ముందుకు కదలడంతో ఎల్లయ్య కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వనపర్తి జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌కు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆర్టీసీ బస్సు వేగంగా కదలడంతో మృతి చెందాడని ఆర్టీసీ డీఎం వేణుగోపాల్‌కు సమాచారం అందించగా, ఆయన అది ప్రైవేటు బస్సు సంబంధం లేదని పొంతనలేని సమాధానం చెప్పారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు గ్రామస్తులతో కలిసి శనివారం రాజపేట బస్టాండ్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోయాయి. అదే సమయంలో డీఐజీ వనపర్తికి వస్తుండగా ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ జలంధర్ రెడ్డి చొరవ తీసుకోవడంతో డీఐజీ వాహనాలకు దారి వదిలారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించి కూర్చున్నారు. ఆర్టీసీ డీఎం రావాలని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో డీఎస్పీ, ఎస్‌ఐ ఆర్టీసీ డీఎంతో మాట్లాడడంతో ధర్నా విరమించారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు..

ధరూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు వ్యక్తి బైక్‌పై నుంచి కింది పడి యువకుడు మృతి చెందిన సంఘటన గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని అల్లాపాడు గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ షకూర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూరుకు చెందిన పరశురాముడు, అతని స్నేహితుడు స్వామి కలిసి ద్విచక్రవాహనంపై కేటీదొడ్డి వైపు వెళుతున్నారు. అల్లాపాడు గ్రామ సమీపంలో ధర్మారెడ్డి పొలం వద్ద బైక్ అదుపు తప్పి పడిపోవడంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా పరశురాముడు మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా, స్వామిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వీరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వైర్ల దొంగ దొరికాడు

- పట్టుకొని పోలీసులకు అప్పగించిన రైతులు



చోరీకి పాల్పడిన వ్యక్తి చుట్టూ గుమికూడిన రైతులు


మిడ్జిల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని కొత్తూరు, మిడ్జిల్ గ్రామాల మధ్యన కేఎల్‌ఐ కాల్వలో ఏర్పాటు చేసిన మోటార్ల వైర్లను చోరీ చేసేందుకు వచ్చిన వ్యక్తిని రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక రైతులు, పోలీసుల వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం కొండనాగుల గ్రామానికి చెందిన సంపంగి గణేష్(చిన్న) ప్రస్తుతం షాద్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కొత్తూరు, మిడ్జిల్ గ్రామాల శివారులలో కేఎల్‌ఐ కాల్వలో ఏర్పాటు చేసిన మోటార్ల తీగలను కత్తిరిస్తుండగా రైతులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విషయం మండలం అంతటా వ్యాపించడంతో ఇటీవల మోటార్ల వైర్లు చోరీకి గురైన బాధిత రైతులు పెద్దఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఇదిలా ఉండగా, చోరీ చేసిన గణేష్ మిడ్జిల్‌లో ఉంటే విషయాలు రాబట్టేందుకు ఇబ్బందిగా ఉంటుందని భావించిన పోలీసులు అక్కడి నుంచి జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. ఇదే విషయంపై ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడిని వివరణ కోరగా.. వైర్ల చోరీకి పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, ప్రస్తుతం అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా ఓ కానిస్టేబుల్ చోరీకి పాల్పడిన వ్యక్తికి మద్దతుగా మాట్లడినట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అతనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది.

గొర్రెల కాపర్లపై దాడి: ముగ్గురిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల కాపరులపై అకారణంగా దాడి చేసిన రమేష్‌రావు, రాజల్‌రావు, జనార్దన్‌రావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్సు డిపో ఎదురుగా రోడ్డుపై శుక్రవారం మధ్యాహ్నం బొందలపల్లి గ్రామానికి చెందిన కురువ గొల్లలు గొర్రెలను తమ గ్రామానికి తీసుకుపోతుండగా అకారణంగా తమపై దాడి చేసి గాయపర్చారని కత్తి చిన్నయ్య, కత్తి రాములు, కత్తి బాలచంద్రయ్య, కొత్త బల్లెయ్యలు శనివారం ఫిర్యాదు చేశారు. కర్రలతో దాడి చేసి రక్తగాయాలకు గురి చేసినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపులేని పేకాట

- స్థావరాలను ఏర్పాటు చేసి జూదం నిర్వహిస్తున్న కొందరు ప్రముఖులు
- ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో పెచ్చుమీరుతోన్న జూదం
- ఇప్పటివరకు 31 కేసుల్లో 232 మంది అరెస్ట్



గద్వాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో గత కొంతకాలంగా పేకాట జోరందుకుంది. జోగుళాంబ గద్వాల జిల్లా వాసులే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చి పేకాట ఆడుతున్నట్లు తెలుస్తున్నది. ఒక్కో ఆటలో రూ. 50 లక్షల నుంచి రూ. 2కోట్ల దాకా కూడా పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. పేకాట స్థావరాలపై పోలీసులు ఎన్నిసార్లు దాడులు చేసినా పేకాట మళ్లీ షరామామూలుగానే కొనసాగుతోంది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో పేకాట ఎక్కువగా ఆడుతున్నారన్న సమాచారంతో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఎస్పీ అధికారులతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. స్పెషల్ బ్రాంచి (ఎస్బీ) అధికారుల సమాచారంతో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహిస్తూ పలు కేసులను నమోదు చేసి నగదును కూడా సీజ్ చేశారు. జిల్లాలో ఎక్కడ పేకాట నిర్వహిస్తున్నా వారిపై వెంటనే దాడులు చేయాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పేకాట స్థావరాలపై, వాటిని నిర్వహించే వారిపై ఎప్పుడూ నిఘా ఉంచాలని, పేకాట ఆడుతున్న వారితో పాటు నిర్వహించే వారిపై కూడా కేసులు నమోదు జరిగేలా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచిస్తున్నారు.

● కర్నూల్‌కు చెందిన వ్యక్తే ప్రధాన సూత్రధారి

జోగుళాంబ గద్వాల జిల్లాలో పేకాట ఆడుతున్న విషయంలో కొందరు ప్రముఖుల పాత్ర ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరితో పాటు కర్నూల్‌కు చెందిన ఓ వ్యక్తి పేకాట వ్యవహారంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా పోలీస్ అధికారులు వీరిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. జిల్లా కేంద్రంలోని కొందరు ప్రముఖులు కలిసి ఓ నిర్వాహకుడి ఇంటిలో పేకాట ఆడుతున్నట్లు తెలుస్తున్నది. అయితే వీరిని పోలీస్ అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదో అర్థం కావడం లేదు. అలాగే కర్నూల్ జిల్లాకు చెందిన నిర్వాహకుడు జోగుళాంబ గద్వాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్థావరాలను ఏర్పాటు చేసి జోరుగా పేకాటను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీస్ అధికారులు వీటిపై నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

● పోలీసులు పట్టుకున్న వాటిలో మచ్చుకు కొన్ని..

● గత నెల 16న జమ్మిచేడు దగ్గర ఓ లాడ్జిలో పేకాట ఆడుతుండగా గద్వాల రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి 12 మందిని అరెస్ట్‌చేసి వారినుంచి రూ. 2,00,790ను సీజ్ చేశారు. ఇందులో ఓ మాజీ ప్రజాప్రతినిధి కూడా ఉండటం గమనార్హం.

● గత నెల 7న జోగుళాంబ గద్వాల జిల్లా సరిహద్దులో ఉన్న బీచుపల్లి అవతల ఉన్న రంగాపూర్ శివారులో పేకాట ఆడుతున్న 15 మందిని అరెస్ట్ చేశారు.

వారినుంచి రూ. 6,35,600తో పాటు నాలుగు కార్లు, మూడు బైక్‌లు, 15మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

● సెప్టెంబరు 3న గద్వాల మండలం అనంతపురం గ్రామశివారులో పేకాట ఆడుతుండగా రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ దాడులు నిర్వహించి 11 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు 32వేల నగదు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

● జిల్లాలో జూలై 13వ తేదీన జిల్లాలోని ఉండవల్లి సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో గద్వాల జిల్లాకు చెందిన ఓ ప్రత్యేక పోలీస్ బృందం దాడులు నిర్వహించి 15 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 2,11,860లను స్వాధీనం చేసుకున్నారు.

● పేకాటను పూర్తి స్థాయిలో నిరోధించేలా కృషి



పేకాటను పూర్తి స్థాయిలో నిరోధించి జోగుళాంబ గద్వాల జిల్లాను పేకాట రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తా. స్థావరాలపై నిఘా ఉంచి పేకాట ఆడుతున్న వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు నగదును కూడా సీజ్ చేయడం జరుగుతుంది. జిల్లాలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు ప్రజలకు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

- శ్రీనివాసరావు, ఎస్పీ

పేకాటరాయుళ్లకు ముందస్తుగా సమాచారం

జోగుళాంబ గద్వాల జిల్లాలో పేకాటను పూర్తి స్థాయిలో నివారించాలని రాష్ట్ర అధికారులు ఆదేశాల మేరకు ఎస్పీ దాడులు నిర్వహిస్తుంటే.. ఈ క్రమంలో కొందరు కిందిస్థాయి పోలీసులు ముందస్తు సమాచారాన్ని పేకాట రాయుళ్లకు చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.. ఇటీవలే అనంతపురం గ్రామంలోని గుట్టలో పేకాట ఆడుతున్న సమాచారం తెలియడంతో రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ దాడులు నిర్వహించే క్రమంలో అనంతపురం వెళ్తుండగా కొందరు సిబ్బంది వారికి ముందుస్తుగా సమాచారం చేరవేశారు. దీంతో అక్కడి నుంచి కొందరు పారిపోయినట్లు సమాచారం. చివరకు ఎస్‌ఐ కొందరిని పట్టుకొని కేసులు నమోదు చేశారు. అలాగే జమ్మిచేడు శివారులోని ఓ లాడ్జిలో గతంలో ఓ మాజీ ప్రజాప్రతినిధితో పాటు పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పట్టణ ఎస్‌ఐ అక్కడికి వెళ్లేలోగా సిబ్బంది సమాచారం ఇవ్వడంతో అక్కడినుంచిఅందరు జారుకున్నట్లు తెలుస్తున్నది. ఇలా కొందరు పోలీసు అధికారులు పేకాట స్థావరాలపై దాడులు చేస్తుంటే మరికొందరు ఇలా ముందస్తుగా వారికి సమాచారం చేరవేస్తూ వారినుంచి ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏది ఏమైనా జిల్లా పోలీస్ అధికారులు వీరిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

ఇప్పటివరకు కేసుల వివరాలు ఇలా...

జోగుళాంబ గద్వాల జిల్లాలో 2024 జనవరి నుంచి ఇప్పటివరకు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి దాదాపు 31 కేసులు నమోదు చేశారు. 232 మందిపై కేసులు పెట్టినట్లు జిల్లా పోలీసులు తెలిపారు. వీరినుంచి దాదాపు రూ.16 లక్షల దాకా నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. వీటితో పాటు కార్లు, బైక్‌లు, సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నెట్‌బాల్, జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

క్రీడా వార్తలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం స్థానిక మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-14,17 నెట్‌బాల్, మహబూబ్‌నగర్ జిల్లా అండర్-14 బాల, బాలికల అథ్లెటిక్స్ జట్ల ఎంపికలను నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ శారదాబాయి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఎంపికలను పారదర్శకంగా నిర్వహించి, ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేస్తామని తెలిపారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, ఆనంద్, అరుణజ్యోతి, శ్రీనివాసులు, రాంమోహన్, సోహెల్, ఖాజాఖాన్ పాల్గొన్నారు.



నెట్‌బాల్ ఎంపికకు హాజరైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శారదాభాయి

ఉత్సాహంగా..

నిర్మల్ జిల్లాలో ఈ నె 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ బాల,బాలికల జట్ల ఎంపికలను శనివారం జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికలను ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదభాయి ప్రారంభించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యాదర్శి ఖాజాఖాన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి బాలుర విభాగంలో 110, బాలికల విభాగంలో 80 మంది ఎంపికలకు హాజరైనట్లు తెలిపారు. శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామని చెప్పారు. నెట్‌బాల్ ప్రతినిధులు సోహెల్, సాదత్‌ఖాన్, రాంమోహన్‌గౌడ్, అంజద్, అరుణజ్యోతి, అక్రమ్ పాల్గొన్నారు.

రేపు యోగా, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్-19 యోగా, సాఫ్ట్‌బాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 సెక్రటరీ పాపిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో యోగా, అల్‌మదీన కళాశాల మైదానంలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికలు ఉంటాయని, ఉదయం 9 గంటలకు పదవ తరగతి మెమో జిరాక్స్, ఒరిజినల్ బోనఫైడ్‌తో హాజరుకావాలని కోరారు.

5న అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఉమ్మడి జిల్లా అండర్-14,17 అథ్లెటిక్స్ బాల, బాలికల జట్ల ఎంపికలు ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఉంటాయని, ఎంపికలకు వచ్చే క్రీడాకారులు పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో రావాలని సూచించారు.

నేడు గో-గేమ్ రాష్ట్ర జట్టు ఎంపికలు

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ గో-గేమ్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర బాల,బాలికల జట్ల ఎంపికలను ఆదివారం లిటిల్‌స్కాలర్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నసురుల్లా హైదర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్‌షకీల్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

-ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. లిటిల్ స్కాలర్స్ స్కూల్స్ ఆధ్వర్యంలో స్థానిక ఎండీసీఏ మైదానంలో నిర్వహిస్తున్న జలజం సత్యనారాయణ స్మారక అంతర్ పాఠశాలల క్రికెట్ టోర్నీని శనివారం ఆయన హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజం పేరిట ప్రతీ ఏడాది ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడల్లో జిల్లా విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. మూడో రోజు పోటీల్లో లిటిల్‌స్కాలర్స్, జిల్లా పరిషత్ హైస్కూల్ నంచర్ల, మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్, ఫాతిమా విద్యాలయ జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, సభ్యులు గోపాల్‌కృష్ణ, కోచ్ అబ్దుల్లా, పీఈటీలు వినోద్, అరుణ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్

నలుగురు యువకుల బైండోవర్

తాడూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని ఇంద్రకల్‌కి చెందిన నలుగురు యువకులను పోలీసులు శనివారం తహసీల్దార్ కిరణ్మయి ముందు బైండోవర్ చేశారు. గత కొన్ని రోజులుగా ప్రతి విషయంలో తల దూరుస్తూ గొడవలకు పాల్పడుతున్న ఆ యువకులను ఎస్‌ఐ గురుస్వామి బైండోవర్ అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. లేకుంటే గ్రామంలో అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా Bank of India BOI
తెలంగాణ జోన్, కార్పొరేట్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్, # 10-1-1199/2, PTI బిల్డింగ్, 2వ అంతస్తు, AC గార్డ్స్, హైదరాబాద్. మొబైల్: 8978247617. ఇ-మెయిల్: telangana.god@bankofindia.co.in
నారాయణ్‌పేట్, నాగర్‌కర్నూల్ మరియు వనపర్తిలలో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిని దీర్ఘకాలిక లీజు/అద్దెపై ప్రారంభించుటకు ఆవరణ కావలెను
నారాయణ్‌పేట్ (నారాయణ్‌పేట్ జిల్లా), నాగర్‌కర్నూల్ (నాగర్‌కర్నూల్ జిల్లా) & వనపర్తి (వనపర్తి జిల్లా)ల వద్ద నూతన శాఖలను ప్రారంభించుటకు సిద్ధంగా ఉన్న ప్రాంగణములను దీర్ఘకాలిక లీజు ప్రాతిపదికన, ప్రాధాన్యంగా 20 సంవత్సరాల వరకు లీజుకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న ఆసక్తి గల పార్టీల నుండి టెక్నికల్ మరియు ఫైనాన్షియల్ బిడ్‌లను కలిగి ఉన్న సీల్డ్ కవర్‌లలో ఆఫర్‌లు ఆహ్వానించబడ్డాయి. ప్రాంగణమునకు కావలసిన కార్పెట్ ఏరియా 1500 చ.అ./ గ్రౌండ్ ఫ్లోర్ అయి ఉండాలి. "నారాయణ్‌పేట్ వద్ద బ్యాంక్ ఆఫ్ ఇండియా కొరకు ప్రాంగణము యొక్క ఆఫర్", "నాగర్‌కర్నూల్ వద్ద బ్యాంక్ ఆఫ్ ఇండియా కొరకు ప్రాంగణము యొక్క ఆఫర్" & "వనపర్తి వద్ద బ్యాంక్ ఆఫ్ ఇండియా కొరకు ప్రాంగణము యొక్క ఆఫర్"తో సూపర్‌స్క్రైబ్ చేయబడిన ఆఫర్‌ను కలిగి ఉన్న కవర్ మరియు ఆఫర్‌దారు పేరు మరియు చిరునామా/ ఫోన్ నంబర్/ మొబైల్ నంబర్ కూడా ఉండాలి. సక్రమంగా సీలు చేయబడిన కవర్‌ను దిగువ తెలిపిన చిరునామాకు పంపించవలెను: ది జోనల్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ జోన్, పీటీఐ బిల్డింగ్, 10-1-1199/2, 2వ అంతస్తు, ఏ.సి. గార్డ్స్, హైదరాబాద్-500004.
ఆసక్తి గల పార్టీలు "బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్" పేరున రూ.1,000/- (వాపసు ఇవ్వబడని) డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు టెక్నికల్ మరియు ఫైనాన్షియల్ బిడ్‌ను సమర్పించవలసినదిగా అభ్యర్థించబడుచున్నారు. ఆఫర్‌దారు సూచించిన ప్రొఫార్మా, వివరాలను మా బ్యాంక్ ఆఫ్ ఇండియా, జోనల్ ఆఫీస్/ లేదా మా బ్యాంక్ వెబ్‌సైట్: www.bankofindia.co.in నుండి పొందవచ్చు. ఆఫర్‌లను స్వీకరించడానికి చివరి తేది: 18.11.2024 (సోమవారం సాయంత్రం 4.30 గంటల వరకు). ఈ నోటీసు కోసం ఏదైనా సవరణ ఉంటే మా ఇ-పోర్టల్ వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రచురించబడింది. ఏ కారణాలు తెలుపకుండానే ఏదైనా ఒక టెండరును తిరస్కరించే లేదా అంగీకరించే లేదా అన్ని టెండర్లను తిరస్కరించే హక్కు బ్యాంక్ కలిగి ఉంది.
తేది: 02-11-2024 సం/- జోనల్ మేనేజర్

WALK-IN INTERVIEW

రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న బల్క్‌డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక దారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2020 to 2024 PASSED OUT CANDIDATES

Job Title	Qualification		Stipend (P.M)
Trainee Helper	S.S.C , Inter / ITI (Fitter, Electrical, Diesel Mechanic)	Age 21-25 years	Rs. 15,000/-
Trainee Supervisor/ Graduate Apprentice	B.Sc (Chemistry) మొదటి 2 సంవత్సరములు అన్ని సబ్జెక్టులు పాసై 3వ సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా అర్హులు. సెలక్ట్ అయిన అభ్యర్థులు 20 రోజుల లోపు జాయిన్ అగుటకు సిద్ధంగా ఉండవలెను.		Rs. 18,000/-
	B.Pharmacy B.Tech (Chemical/Mechanical) మొదటి 3 సంవత్సరములు అన్ని సబ్జెక్టులు పాసై 4వ సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా అర్హులు. సెలక్ట్ అయిన అభ్యర్థులు 20 రోజుల లోపు జాయిన్ అగుటకు సిద్ధంగా ఉండవలెను.		Rs. 20,000/-
	M.Sc (Organic Chemistry/ Analytical Chemistry /Micro Biology)		Rs. 22,000/-
	M.Pharmacy (Pharmaceutical Chemistry/ Analysis/QA/RA)		Rs. 24,000/-

పై అర్హతలు గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకొని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్ట్‌లలో పనిచేయవలసియుండును.

09-11-2024 | SWAMY VIVEKANANDA PG & DEGREE COLLEGE, PR Colony, MAHABOOB NAGAR

Interview Time : 9:00 am to 3:00 pm

సదుపాయములు: 1.బ్యాచ్‌లర్స్‌కు (పురుషులు) ఉచిత వసతి 2.ఉచిత యూనిఫాం 3.అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును 4.భోజన ఖర్చులో రాయితి

Issued by : SSM Manpower Services
Cyberhills Colony, PJR Nagar, Gachibowli, Hyderabad, Telangana.
Contact : 9704855324

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

PROPERTY FOR SALE
★ "Independent House for sale" 2BHK, 184yds, East Facing at Jedcharla Mobile: 9886154400
AJH-0992

ANDHRA JYOTHI CLASSIFIEDS
3+1 Scheme
ప్రతి 4 లైన్లకు 200/- రూ
ప్రతి అదనపు లైను 45/- రూ
9985411175
9550413644
ఆంధ్రజ్యోతి

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

యూనివర్సిటీని గాడిన పెట్టాలి

- వీసీని ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీని గాడిన పెట్టాలని విశ్వవిద్యాలయంలో అసాంఘిక కార్యక్రమాలకు తావివ్వకూడదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రగతి భవన్‌లో వైస్ చాన్సలర్‌ల సమావేశంలో భాగంగా పీయూ వైస్ చాన్సలర్ పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్‌ని సీఎం ఆదేశించారు. పాలమూరు యూనివర్సిటీలో మాదకద్రవ్యాలకు తావివ్వకుండా, చెడు అలవాట్లకు పాల్పడకుండా యువతను క్రమశిక్షణతో మెలిగేలా చూడాలని సూచించారు. యూనివర్సిటీకి కావల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని, వర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. యూనివర్సిటీకి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి తీసుకురావాలని వీసీని ఆదేశించారు. అనంతరం మంత్రి సీతక్కను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసినట్లు పీయూ వైస్ చాన్సలర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రితో 2022లో పీయూ ఎస్టీ మెన్స్ హాస్టల్, ఎస్టీ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం కోసం మంజూరై పెండింగ్‌లో ఉన్న నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి ఉన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి పూలబొకే ఇస్తున్న పీయూ వైస్ చాన్సలర్ జీఎన్ శ్రీనివాస్

ఇంటర్వ్యూ..



మధ్యవర్తులకు అవకాశం లేదు

» అయిజ తహసీల్దార్ జ్యోతి

అయిజ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అవసరం ఉన్న వారు నేరుగా కార్యాలయానికి వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలి. మధ్యవర్తులకు అవకాశం ఇవ్వను అని అయిజ తహసీల్దార్ జ్యోతి శనివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

కులగణన సర్వే ఎప్పుడు ప్రారంభమవుతోంది?

ఈనెల 6వ తేదీన ప్రారంభమై 18వ తేదీతో ముగుస్తుంది. ఇందుకోసం మొత్తం 150 మంది ఎన్యుమరేటర్లను ఏర్పాటు చేశాం.

ఒక ఎన్యుమరేటర్ ఎంతమందిని సర్వే చేయాలి?

150 గృహాలను సర్వే చేయాల్సి ఉంటుంది. రోజు 10 గృహాల చొప్పున కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేయాలి.

ఇసుక అక్రమ తరలింపు ఎలా అడ్డుకుంటున్నారు?

ఇసుక, మట్టి అక్రమ తరలింపును ఎప్పటికీ ప్రోత్సహించము. అవసరమైన వారు అనుమతి తీసుకుని ఇసుక, మట్టి తరలించాలి.

న్యూస్ బాక్స్

యువకులు క్రీడల్లో రాణించాలి

ధరూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వివిధ రకాల పోటీల్లో యువకులు ప్రతిభ చాటాలని కాంగ్రెస్ నాయకుడు కుర్వ శ్రీనివాసులు అన్నారు. దీపావళి సందర్భంగా శనివారం మండల కేంద్రంలో సందెరాళ్ల పోటీలు నిర్వహించి, గెలుపొందిన మొదటి విజేతకు రూ.4,500 నగదు అందజేశారు.

మొక్కలు నాటిన మునిసిపల్ సిబ్బంది

వడ్డేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛతా హీ సేవా, ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా శనివారం వడ్డేపల్లి శివారు పైపాడు రోడ్డుకు ఇరువైపులా మునిసిపల్ సిబ్బంది మొక్కలు నాటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. మునిసిపల్ సిబ్బంది కృష్ణవర్ధన్ నాయుడు, వెంకటన్న, మద్దిలేటి, సంజీవ రాజు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధరూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ధరూరు సబ్‌స్టేషన్ పరిధిలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పు, ఏబీ స్విచ్ మార్పు తున్నందున ఆదివారం ఉదయం 11 నుంచి మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు, ధరూరు ఏఈ అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధరూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ధరూరు, జాంపల్లి, బూరెడ్డిపల్లి, దోర్నాల, కాపులకుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోలీస్ 30 యాక్ట్ అమలు - ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం నుంచి డిసెంబరు ఒకటి వరకు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ యాక్ట్ ప్రకారం డీఎస్పీ, పోలీసు ఉన్నతాధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించ కూడదన్నారు. అలాగే ఆయుధాలు, పేలుడు సామగ్రి, కర్రలు వంటివి తీసుకువెళ్లడం నిషేధం అన్నారు. రోడ్లు, పబ్లిక్ స్థలాల్లో ప్రజలకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించడం, సమూహాలుగా ఏర్పడటం వంటివి నిషేధమన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు, మైకులు వినియోగించడం నిషేధం అన్నారు. ఎవరైనా నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

గద్వాల అర్బన్/అలంపూర్ చౌరస్తా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో, అలంపూర్ చౌరస్తాలోని తమ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ వినియోగదారుల దినోత్సం-2024 నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరావు, ఏడీఏ రమేష్‌బాబు, చిన్న మగ్బూల్‌భాష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి గద్వాల డివిజన్ ఇంజనీర్, అకౌంట్ ఆఫీసర్, సబ్ డివిజన్ ఆఫీసర్‌తో పాటు సబ్ డివిజన్ పరిధిలోని గద్వాల పట్టణ, గద్వాల రూరల్, ధరూరు, కేటిదొడ్డి మండలాలకు సంబంధించిన సెక్షన్ ఆఫీసర్లు, ఏఈ హాజరవుతారన్నారు. గద్వాల సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వడ్డేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పశువుల్లో సంక్రమించే వ్యాధులు అరికట్టేందుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి పుష్పలత పశువుల యజమానులకు సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కోయిలదిన్నెలో ఏర్పాటు చేసిన శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశు వైద్య లైవ్‌స్టాక్ అధికారి వరప్రసాద్, ఎల్ఎస్ఏ లతీఫ్, బుచ్చమ్మ, ఓఎస్ వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్ర నారాయణ గౌడ్ ఉన్నారు.

ఆగని అక్రమ రవాణా

» రాత్రి వేళ జోరుగా సాగుతున్న మట్టి, ఇసుక తరలింపు

» అనుమతులు కొంత.. తరలించేది కొండంత » పట్టించుకోని అధికారులు

ఎర్రవల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అధికారుల కళ్లు గప్పి రాత్రి వేళ టిప్పర్ల ద్వారా మట్టి, ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణాకు అక్రమార్కులు తెరలేపుతున్నారు. ఎర్రమట్టి అయితే అనుమతి కొంత తీసుకుని ఎక్కువ మట్టి తరలిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. రాత్రి వేళ ఇసుక సైతం టిప్పర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇటీవల శనివారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. అయితే ప్రతీ రోజు అధికారులు కళ్లుగప్పి నడుస్తున్న వాహనాలు ఎన్ని ఉంటాయో అంచనా వే



పట్టుబడిన టిప్పర్ (ఫైల్)

యాల్సిందేనని పలువురు చర్చించుకోవడం గమనార్హం. కాగా ఎర్రవల్లి మండల కేంద్రంగా ఇద్దరు వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా కావాల్సిన జాగ్రత్తలు, అధికారుల అండదండలు ఉన్నాయి. దీంతో పాటు పుటాన్‌దొడ్డి గ్రామ సమీపంలోని గుట్టను సైతం కరగదీస్తున్నారు. కొద్ది రోజులు క్రితం అనుమతుల పేరిట విచ్చలవిడిగా తరలించారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు దీనిపై దృష్టి సారించి అక్రమ రవాణకు చెక్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేసులు నమోదు చేస్తాం

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో ఇటీవల రెండు ట్రాక్టర్లను పట్టుకున్నాం. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తాం. మట్టి రవాణా విషయంలో రెవెన్యూ అధికారులు ద్వారా ఫిర్యాదు వస్తే పట్టుకునేందుకు ఉన్నతాధికారుల ఆదేశం ఉంది.

- వెంకటేష్, ఎస్ఐ

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కలెక్టర్ బీఎం. సంతోష్

గద్వాల న్యూటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ బీఎం. సంతోష్ అన్నారు. శనివారం రాష్ట్ర పౌర సరఫరాశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోలుపై ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న సమస్య తలెత్తకుండా సమర్థవంతగా ధాన్యం కొనుగోలు జరిగేలా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించి, అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి వెంటనే ఏర్పాటు చేయాలనిన్నారు. రైస్ మిల్లర్లు తాలు, తేమ పేరుతో కోతలు చేయవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యతా ప్రమాణాలు పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని, రైతులకు ఎటువంటి నష్టం రావడానికి వీలు లేదన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారెంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున, కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు అవసరం మేరకు ఇంటర్మీడియట్ గోదాంలను సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో రైతులకు చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం రాకుండా బార్డర్ల వద్ద చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి స్వామికుమార్, జిల్లా మేనేజర్ విమల, డీసీవో ప్రసాద్‌రావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

వైభవంగా పాగుంట వెంకన్న రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్న పాగుంట లక్ష్మీ వేంకటేశ్వర స్వామి రథోత్సవం శనివారం అంగరంగా వైభవంగా జరిగింది. మండలంలోని వెంకటాపురం గ్రామంలో స్వామివారి రథోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి హాజరై భక్తులతో కలిసి రథాన్ని లాగారు. ముందుగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల అనంతరం రథానికి పూజలు చేసి భక్తులతో కలిసి రథాన్ని లాగారు. రథోత్సవ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, గట్టు మాజీ ఎంపీపీ విజయ్, వెంకటాపురం గోపి, ఉరుకుందు, యుగంధర్‌గౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

గద్వాల న్యూటౌన్ : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తా మని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేటీ దొడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి, మాట్లాడారు. నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రాజారెడ్డి, నాయకులు వంటభాస్కర్, చిన్నయ్య, చక్రధర్‌రావు ఉన్నారు.



మట్టితో ఉన్న పెద్దవాగు అప్రోచ్ రోడ్డు

దుమ్మురేగుతోంది

అయిజ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అయిజ పట్టణ ప్రధాన రహదారులపై దుమ్మురేగుతోంది. ఈ రహదారులపై ప్రయాణించాలంటే వ్యాధులు కొని తెచ్చుకున్నంటే అని, ఇందుకు అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యమే కారణం అంటున్నారు ప్రయాణికులు. అయిజ పాత బస్టాండు, అంబేద్కర్ చౌక్, కొత్త బస్టాండు మీదుగా నిర్లక్ష్యంగా వదిలివేసిన అప్రోచ్ రోడ్డు కారణం అవుతోంది. వంతెన నిర్మాణంలో భాగంగా బీటీ వేయకుండా మట్టి అప్రోచ్ రోడ్డు వేసి వదిలివేశారు. ఈ రోడ్డు ప్రధానం కావటంతో నిత్యం వందలాది వాహనాలు, ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. వాహనం వెళ్లిన వెంటనే వెనుకాలే పెద్ద మొత్తంలో దుమ్ము పైకి లేస్తోంది. ఇది ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు, పాదాచారులకు ఇబ్బందిగా మారుతోంది. మునిసిపాలిటీ నుంచి అయిన ఈ మట్టి పై నీరు చల్లి దుమ్ము రేగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అప్రోచ్ పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటాని అలంపూర్ తాలూకా ఆర్అండ్‌బీ అధికారి మహేష్ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సరిత

కేటీదొడ్డి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె కాలిపోయి ఉరుకుందు కుటుంబం నిరాశ్రులయ్యారు. విషయం తెలుసుకున్న గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ సరిత శనివారం కేటీ దొడ్డిలో బాధిత కుటుంబ సభ్యులను ప రామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకొని బాధితులకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.



బాధిత కుటుంబ సభ్యును పరామర్శిస్తున్న సరిత

ప్రైవేటు పాఠశాలలో వంట మనిషి మృతి

అలంపూర్ చౌరస్తా, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్న వంట మనిషి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. కర్నూలు జిల్లా గోనేగండ్ల మండలం, కులుమల గ్రామానికి చెందిన ఆంజనేయులు (52) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదిహేనేళ్లుగా వంట మనిషిగా పని చేస్తుండగా అతని భార్య రాధమ్మ ఆయాగా పని చేస్తూ జీవిస్తుండేవారు. శుక్రవారం సాయంత్రం వంట చేసే సమయంలో ఆకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోయాడు. దీంతో తోటి సిబ్బంది గమనించి అక్కడే ఉన్న భార్యకు సమాచారమిచ్చి హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన అక్కడి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య రాధమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు.

తహసీల్దార్‌పై దాడి హేయమైన చర్య

ఇటిక్యాల, నవంబరు 2 (ఆంధ్యజ్యోతి) : ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్‌పై దాడి హేయమైన చర్య అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ ఎస్సీ వర్గానికి చెందిన తహసీల్దార్ నరేందర్ పై మునగాల గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఇబ్రహీం, శేషన్న, బోయ వెంకటన్న అనే ఆరుగురు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మెజిస్ట్రేట్ అధికారిపైన దాడి జరిగితే ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బండారి సునంద్, బల్గేర మోజేష్, విజయ్, జీమణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

గట్టు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బుడకల ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తహసీల్దార్ విధుల్లో ఉండగా దాడి చేసిన ప్రభాకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ఇబ్రహీం, శేషన్న, చాకలి మద్దిలేటి, బోయ వెంకటన్నపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

యువకుడిపై కేసు నమోదు

ధరూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు తన ఫోన్ నెంబర్‌ను బలవంతంగా ఇచ్చి తనతో మాట్లాడాలని వేధించ సాగాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొద్ది రోజులుగా బాలికను తనతో మాట్లాడాలని వేధించడంతో ఈ క్రమంలో సదరు యువకుడి వేధింపులు భరించలేక మైనర్ బాలిక తండ్రి శనివారం ధరూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అబ్దుల్ షకూర్ తెలిపారు.

వినతుల వెల్లువ

గద్వాల న్యూటౌన్/గట్టు/వడ్డేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అయిజ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఎస్సీ బీసీ హాస్టల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి వినతి పత్రం అందించారు. జిల్లాలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నాయకుడు కిరణ్‌కుమార్ వినతి పత్రం సమర్పించారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు తీసుకురావాలని గద్వాల నియోజక వర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధరూర్ రవి, నడిగడ్డ ప్రాంతంలో ప్రతీ మండలానికి ఒక జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య వినతి పత్రం సమర్పించారు. అదే విధంగా గట్టు మండల సీఆర్పీఎఫ్ సభ్యులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని వినతిపత్రం అందించారు. అంతకుముందు శాం తినగర్ సేవా సమితి సభ్యుడు షేక్ అస్లాం ఫరీష్ ఆకునూరి మురళిని మర్యాద పూర్వకంగా కలిసి స్థానిక విద్యా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తాను రచించిన 'నవ్వులే నవ్వులు' పుస్తకాన్ని అందజేశారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి : ఎమ్మెల్యే



కృష్ణానదిలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూరు నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు చేపలను విక్రయించి ఆర్థికంగా ఎదగాలని అలంపూరు ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండల పరిధిలోని గుందిమళ్ల కృష్ణా నదిలో శనివారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణానదిలో చేప పిల్లలను వదలడం ద్వారా మత్స్యకారులకు జీవనోపాధి కలుతోందని, దీంతో వారు ఆర్థికంగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో మునిపల్ చైర్ పర్సన్ మనోరమ, వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి షకీలా భాను, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షుడు గోపాల్, శ్రీనివాస్ రెడ్డి, చక్రపాణి రెడ్డి, గంగాధర్, మధుసూధన్‌రెడ్డి, తిప్పారెడ్డి, సర్దార్, శ్రీను పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీని నిర్మించొద్దు : సీపీఎం

రాజోలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామ శివారులో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని శనివారం ఆయన మండల సీపీఎం నాయకులతో కలిసి, పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రాజోలిలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రజాభిప్రాయాల మేరకు ఫ్యాక్టరీ పనులు ఆపాలని, ఫ్యాక్టరీ వల్ల కలిగే అనార్థాలకు బాధ్యులు ఎవరు అని ప్రశ్నించారు. ప్రభుత్వం కూడా అనుమతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు రేపల్లె దేవరాజు, పరంజ్యోతి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కార్తీక శోభ

అలంపూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అలంపూరు పుణ్యక్షేత్రంలో శనివారం కార్తీక మాసం మొదటి రోజు కావడంతో ఐదవ శక్తి పీఠం జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వార్లను భక్తులు భారీగా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు తుంగభద్ర నది పుష్కర ఘాట్‌లో పుణ్య స్నానాలు ఆచరించి, గంగా హారతినిచ్చి దీపాలను నది లో వదిలి, ప్రత్యేక పూజలు చేశారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

అయిజ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు పరచే వరకు పోరాటం సాగిస్తూనే ఉంటామని బీఆర్ఎస్వీ జిల్లా కన్వీనర్ కుర్వ పల్లయ్య అన్నారు. శనివారం అయిజలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు రూ.ఐదు లక్షల భరోసా కార్డు అందిస్తామని ఇవ్వలేదన్నారు. మెగా డీఎస్సీ వేయలేదని, గురుకులాలలో మౌలిక వసతుల కల్పన ఏర్పాటుపై దృష్టి సారించలేదన్నారు. కార్యక్రమంలో భరత్‌బాబు, ఖాజావలి, సోమశేఖర్, ముత్యాలి, రాజు, మైబు, రవితేజ, ఖాజా పాల్గొన్నారు.

నాణ్యతకు తిలోదకాలు

» ఇష్టానుసారంగా ఆర్డీఎస్ పనులు

» మూడు నెలలకే షెటర్ ధ్వంసం

మానవపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీఎస్ పనులు అంటేనే ఇష్టానుసారంగా చేస్తుంటారని పేరుంది. ఇది ప్రస్తుతం నిజమనిపిస్తోంది. తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందుతోంది. ఈ క్రమంలో ఎగువనున్న కాల్వలకే అధికంగా నీటి ప్రవాహం జరిగి నీరు వృథా అవుతోందని, ఉన్నతాధికారు మూడు నెలల క్రితం ఆర్డీఎస్ 29వ కాల్వ పనులు చేయించారు. పనులు చేసిన తరువాత మొదటి సారిగా తుమ్మిళ్ల ద్వారా సాగునీటిని విడుదల చేయగా, 29వ కాలువ అమరవాయి గ్రామానికి వెళ్లే మొదటి తూమ్ షెటర్ నీటి ప్రవహానికి ధ్వంసమైంది. ప్రస్తుతం కొద్దిపాటి నీటి ప్రవహానికే షటర్లు ధ్వంసమైతే రానున్న రోజుల్లో ఏ విధంగా ఉంటుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నీటి ప్రవాహానికి ధ్వంసమైన షటర్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

అయిజ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని శైలజ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తిమ్మారెడ్డి తెలిపారు. 10వ తరగతి చదువుతున్న శైలజ పాఠశాల స్థాయి క్రీడల్లో అండర్ 17 విభాగంలో ఈనెల 1వ తేదీన వనపర్తి జిల్లా పెబ్బేరులో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి, ఈనెల 3, 4, 5వ తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శనివారం ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీకి ఎంపికైన విద్యార్థిని

ఇసుక లారీ, ట్రాక్టర్ పట్టివేత

అలంపూర్ చౌరస్తా/రాజోలి, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారులో హైదరాబాదు వెళ్తున్న ఓ ఇసుక లారీని పట్టుకున్నట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి బ్లూకోట్ సిబ్బంది రవి, మద్దిలేటి చౌరస్తా సమీపంలో లారీని పట్టుకొని డ్రైవర్ శ్రీనువాసులును విచారించగా కర్నూలు జిల్లా వెల్దుర్తి నుంచి హైదరాబాదుకు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తెలిపాడు. దీంతో లారీని స్టేషనుకు తరలించి సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. అదే విధంగా రాజోలి మండలం మాన్‌దొడ్డి శివారులోని ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. శుక్రవారం రాత్రి మాన్‌దొడ్డి శివారులో తనిఖీ నిర్వహించగా ఇసుకను తరలిస్తున్నట్లు ట్రాక్టర్‌ను పట్టుకొని యజమాని అనీల్, డ్రైవర్ గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధిని విస్మరించిన ఎమ్మెల్యే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అలంపూర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిలు అభివృద్ధిని గాలికి వదిలేస్తున్నారని బీజేపి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. శనివారం అయిజ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ నియోజకవర్గంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని, కానీ ఇక్కడ మాత్రం అసంపూర్తి బస్ డిపో, అగ్నిమాపక కేంద్రం ఉన్నాయని తెలిపారు. ప్రధాన పట్టణమైన అయిజను అన్ని విధాలుగా దూరం పెట్టారని, డిగ్రీ కళాశాల, రెవెన్యూ డివిజన్, వసతి గృహాల ఏర్పాటు జరగాల్సి ఉందన్నారు. బీజేపీ నాయకులు ప్రదీప్‌స్వామి, భగత్‌రెడ్డి, వెంకటేష్, మధు పాల్గొన్నారు.